క్లుప్తంగా

దెందులూరు ఎంపీడీఓగా శ్రీలత బాధ్యతల స్వీకరణ



దెందులూరు: దెందులూరు మండల ఎంపీడీఓగా వి.శ్రీలత బుధవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శ్రీలత కృష్ణా జిల్లా డ్వామా ఏపీడీగా పనిచేస్తూ బదిలీపై దెందులూరు ఎంపీడీఓగా వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భీమరాజు నూతన ఎంపీడీఓకు బాధ్యతలను అప్పగించారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు



కుటుంబ సమేతంగా నారసింహునికి పూజలు నిర్వహిస్తున్న నాయకుడు బద్రి

ద్వారకాతిరుమల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని కోరుతూ ఐఎస్ జగన్నాధపురంలోని సుందర గిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారికి కొవ్వూరు మండలం కుమారదేవంకు చెందిన వైఎస్సార్ సీపీ ఎన్నారై, ఐటీ విభాగం రాష్ట్ర నాయకులు పసుపులేటి వీరభద్రరావు(బద్రి) బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి పూజాధికాలను జరుపుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ నారసింహుడు తన ఇష్టదైవమన్నారు. భక్తులు స్వామివారికి నైవేద్యంగా సమర్పించే పాలపొంగళ్లకు వండే షెడ్లను తాను నిర్మించినట్టు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని స్వామివారికి పూజలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, కరాటం చినరాయుడు, శాసనాల రాజేష్, పుప్పాల పుండరీకాక్ష పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి



జూదరులను అదుపులోకి తీసుకున్న అధికారులు

ఏలూరు టౌన్: స్థానిక తంగెళ్లమూడిలో పేకాట శిబిరంపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం సాయంత్రం దాడి చేశారు. ఎస్పీ మేరి ప్రశాంతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ సీఐ ప్రసాద్ కుమార్ తమ సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.20,900 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చర్యలు తీసుకునేందుకు ఏలూరు టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు

జంగారెడ్డిగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జెడ్పీటీసీ పోలనాటి బాబ్జి అన్నారు. బుధవారం స్థానిక ఎంవీ సోషల్ క్లబ్ ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఆరోగ్యశ్రీ వ్యయ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతోపాటు గడపగడపకూ వైద్యసేవలు అందించేందుకు చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం లాంటిదని వివరించారు. జగనన్న ఆరోగ్య శిబిరంలో ప్రభుత్వమే అన్ని రకాల వైద్య సేవలు పేదలకు ఉచితంగా అందిస్తుందన్నారు. ఇది నిరంతర ప్రక్రియని అన్నారు. ఈ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యసేవలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు పి.గిరిబాబు గౌడ్, కౌన్సిలర్లు ఏవీఆర్ మూర్తి, కిషోర్ నాయకులు షేక్ అమీర్, విష్ణు, గణేష్, ఆదివిష్ణు, షేక్ అక్బర్, హాఫీజ్ కఠారి సీతారాంబాబు, చిప్పాడ వెంకన్న, రాధాకృష్ణ, కమిషనర్ భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం అందజేత

బుట్టాయగూడెం: మండలంలోని ఓ వ్యక్తి వైద్యానికి ఎమ్మెల్యే బాలరాజు దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. కోయఅంకంపాలెం గ్రామానికి చెందిన తామా భీమరాజు అనే గిరిజనుడికి ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రాగా ఏలూరు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయితే భీమరాజుకు మెరుగైన వైద్యం కోసం దుద్దుకూరు క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మీల చేతులమీదుగా బుధవారం ఆర్థిక సహాయం చేశారు. అలాగే రాజమండ్రిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి భీమరాజును పంపించారు. అలాగే సీఎం రిలీఫ్ ఫండ్ అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే బాలరాజు తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధన సీఎం జగన్‌తోనే సాధ్యం

దెందులూరు: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహాన్ని ఏపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్మృతి వనంతో పాటు జాతికి అంకితం చేయడం స్ఫూర్తిదాయకమని పీవీ రావు మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్ అన్నారు. జాతీయ అధ్యక్షుడు నత్తా యోనా రాజు సూచనలు మేరకు గొల్ల కిరణ్ దళిత నాయకులతో సమావేశం నిర్వహించారు. 19న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటం వద్ద నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఈ.విజయ్, ఎం.కార్తీక్, సుధీర్, కే సతీష్, బి.అఖిల్, బి.మూర్తి, వి.ప్రవీణ్‌రెడ్డి, పి.రంగబాబు పాల్గొన్నారు.



కొవ్వలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, నాయకులు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఓ చారిత్రాత్మక ఘట్టం

నిడమర్రు: ఈనెల 19న విజయవాడ స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న 206 అడుగుల ఎత్తయిన భారీ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఏపీ చరిత్రలో చరిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని వైఎస్సార్ సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగేషు అన్నారు. బువ్వనపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.400 కోట్ల వ్యయంతో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 19 సాయంత్రం 4 గంటలకు ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామ సచివాలయం నుంచి ఎంపిక చేసిన ఏడుగురు ప్రతినిధులు తప్పనిసరిగా హాజరవ్వాలని పిలుపు నిచ్చారు. ఉంగుటూరు నియోజకవర్గం వ్యాప్తంగా భారీ సంఖ్యలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆధ్వర్యం



సమావేశంలో మాట్లాడుతున్న స్టేట్ యూత్ సెక్రటరీ సంకు నాగేషు

లో హాజరు కానున్నట్లు తెలిపారు. జనవరి 20 నుంచి సందర్శకులకు అనుమతి ఉంటుందన్నారు. విగ్రహ వేదిక లోపల పర్యాటకులను ఆకట్టుకునేలా ఆడిటోరియం, కన్వెన్షన్ సెంటర్ మ్యూజియం ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ఆవిష్కరణకు తరలి రావాలని సంకు శేషు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గణపవరం టౌన్ అధ్యక్షుడు రొంగల శ్రీను, మండల యూత్ జాయింట్ సెక్రటరీ సంకు కొండల రావు నాయుడు, పాలుపు రెడ్డి చిన్నబ్బులు తదితరులున్నారు.

పెదపాడు ఎంపీడీవోగా తేజరతన్

పెదపాడు: పెదపాడు ఎంపీడీవోగా జే తేజ రతన్ బుధవారం విధుల్లో చేరారు. 2018 లో గ్రూప్ 1 ఆఫీసరుగా నియమితులైన తేజ రతన్ ఇప్పటి వరకూ పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయంలోని గ్రామీణాభివృద్ధి విభాగంలో అధికారిగా పని చేశారు. పెదపాడు ఎంపీడీవోగా ఆయనను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసారు. బుధవారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌ను ఘంటా పద్మశ్రీని ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పెదపాడులో బుధవారం సాయంత్రం ఎంపీడీవోగా విధుల్లో చేరారు. ఇంతవరకు పెదపాడు ఎంపీడీవోగా ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి విధులు నిర్వర్తించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

నిడమర్రు: మందలపర్రులో బుధవారం రాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులపై అరెస్ట్ చేసినట్లు నిడమర్రు ఎస్సై ఆర్.శ్రీను తెలిపారు. వీరి నుంచి రూ.7,600 నగదు సీజ్ చేశామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి తాడేపల్లిగుడెం కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్ర’ పోటీలు



భీమడోలు: తలపడుతున్న చెట్టున్నపాడు, అంబర్‌పేట జట్లు



ఉంగుటూరు: క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన వెల్లమిల్లి 2 జట్టు క్రీడాకారులు

భీమడోలు: ఉత్సాహభరిత వాతావరణంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీల్లో మండల పరిధిలోని ఏడు వాలీబాల్ టీములు పాల్గొనగా వాటిలో అంబర్‌పేట టీము విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించింది. తొలుత మండల స్థాయి పోటీలను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి ప్రారంభించారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం యువ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు దోహద పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ఆటల పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం చెట్టున్నపాడు, అంబర్‌పేట టీముల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. రెండు



ఉంగుటూరు: క్రికెట్ ఫైనల్ ఆటను తిలకిస్తున్న అధికారులు

టీములు హోరాహోరీగా తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో అంబర్‌పేట టీము విజయం సాధించి విజేతగా నిలిచింది. పీడీలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీ విజేత వెల్లమిల్లి జట్టు

ఉంగుటూరు: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు ముగిసాయి. సుమారు వారం రోజులుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం నారాయణపురం కళాశాల బాపిరాజు స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ పోటీలో వెల్లమిల్లి- 2 జట్టు విజేతగా నిలిచింది. కైకరం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. టాస్ గెలిచిన కైకరం జట్టు బౌలింగు ఎంచుకుంది. వెల్లమిల్లి- 2 జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. క్రీడాకారుడు భీమడోలు సోమరాజు 51 పరుగులు చేయడం విశేషం. కైకరం-1 జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 53 పరుగులు మాత్రమే చేయగలిగింది. వెల్లమిలి జట్టులో సీహెచ్ మణి ఒక ఓవరులో హ్యాట్రిక్ వికెట్ సాధించారు. 45 పరుగులు తేడాతో వెల్లమిల్లి-2 సచివాలయ జట్టు విజయం సాధించింది. ప్రత్యర్థి జట్టు ఫైనల్‌కు రాకపోవడంతో మహిళలు జట్టు ఫైనల్‌లో నారాయణపురం జట్టు విజయం సాధించినట్లు ప్రకటించారు. ఎంఈవో- 2 శ్రీనివాసరావు, ఎంపీడీవో ఆఫీసు సూపరింటెండెంట్ ఆంజనేయులు తదితర అధికార్లు ఆటల పోటీలను పర్యవేక్షించారు.

అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

దెందులూరు: కోస్తా జిల్లాలో నమ్మి కొలిచిన భక్తుల పాలిట కొంగు బంగారంగా పూజలు అందుకుంటున్న గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మవారి ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని గాలాయగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి లక్ష్మణరావు, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు కోరారు. బుధవారం దెందులూరులో వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 16 నుంచి 9 రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఇటీవల ఉత్సవాల వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి విడుదల చేశారన్నారు. అమ్మవారి ఉత్సవ కమిటీ రెండు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం, కరపత్రాలు, గోడ పత్రికలు పంపిణీ చేస్తున్నారన్నారు. రెండు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేయాలని అంబటి లక్ష్మణరావు, చిలకా వెంకట సుబ్బారావు కోరారు.

ఎంపీటీసీ కుటుంబానికి ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

దెందులూరు: ఉండ్రాజవరంలో ఎంపీటీసీ సున్నా నరేష్ తండ్రి సున్నా శ్రీనివాస్ బుధవారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి హుటాహుటిన ఎంపీటీసీ ఇంటి వద్దకు చేరుకుని శ్రీనివాస్ భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ నరేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీనివాస్ ఆకస్మిక మరణం పార్టీకి, గ్రామానికి, వ్యక్తిగతంగా తనకు లోటు అని అన్నారు. సొసైటీ చైర్మన్ డీఎస్‌వీడీ ప్రసాద్ (బజ్జి), సర్పంచ్ బోదుల స్వరూప్, పార్టీ నాయకులు సున్నా ఫణీంద్ర, బుద్దా అర్జున, తలారి రామకృష్ణ, వాసే డొమినిక్, బత్రాజు సత్యనారాయణ, ఎంపీటీసీ నరేష్‌ను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంపీటీసీ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

సామాజిక సేవలతో సంతృప్తి



పిప్పరలో వృద్ధులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సుబ్బరాజు



గణపవరం డిగ్రీ కాలేజ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆర్‌వీఎస్ రాజు

గణపవరం: పిప్పరలో సామాజిక సేవకుడు కొలనువాడ సుబ్బరాజు ఆధ్వర్యంలో సుమారు వంద మంది పేద వృద్ధులకు రూ.500 చొప్పున ఆర్థిక సహాయం, సంక్రాంతి రంగవల్లుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ సామాజిక సేవలు, ఆపన్నులకు అండగా ఉండటంలోనే సంతృప్తి లభిస్తుందని అన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కొలనువాడ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి ఆర్థిక సహాయం: గణపవరం వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్. విజయరామరాజు (యూఎస్ఏ) ఆర్థిక సహకారంతో యువతకు ప్రోత్సాహం కార్యక్రమంలో భాగంగా గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో చదువుతున్న యలగం హారికకు ఆర్థిక సహాయం, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేసినట్లు రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు తెలిపారు. ఏటా యువతకు ప్రోత్సాహం పేరుతో విజయరామరాజు ఉత్తమ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిర్మలకుమారి, త్యాగరాజ కళాక్షేత్రం అధ్యక్షుడు మాదేటి సురేష్‌కుమార్ శ్రేష్టి, వర్మ పాల్గొన్నారు.

ముగిసిన సప్తాహాలు



నాదస్వర బృందాన్ని సత్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు




ఉత్సవ పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత నెల 28న ప్రారంభమైన శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు రోజు ఉదయం గంటలకు మహా పూర్ణాహుతి, కుంభ ప్రోక్షణ, గరుడ ధ్వజ అవరోహణ, చక్ర పెరుమాళ్లకు శ్రీ చక్రస్నానం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దెందులూరుకు చెందిన వై.పెద్దిరాజు బృందం నాదస్వర సమ్మేళనం నిర్వహించారు. రాత్రి దర్బారు సేవ, అనంతరం శ్రీవారి విశేష ఆరాధన, వేద పఠనం, వేద ఆశీర్వచనం, శ్రీవారి పవళింపు సేవ, దంపత్తాంబూల కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు కోసూరి సత్యనారాయణాచార్యులు విశేష పూజలు చేయగా, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, ట్రస్టీలు భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


శ్రీకృష్ణదేవరాయల జీవితం నేటి తరానికి ఆదర్శం

భీమడోలు: ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సంత మార్కెట్ వద్ద బుధవారం శ్రీకృష్ణదేవరాయల కాపు యువత ఆధ్వర్యంలో సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయల 533వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేవారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రస్తుత పాలకులు సంక్షేమ పథకాలు అమలు చేయడం చాలా సంతోషదాయమన్నారు. నేటి తరం రాజకీయ నాయకులకు కృష్ణదేవరాయల పాలనాదక్షత ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సాసీపీ మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, నాయకులు యర్రంశెట్టి ఏడుకొండలు, ఈతకోట బాబి, తాతాజీ, ముప్పిరిశెట్టి సుబ్రహ్మణ్యం, శివరాం, పట్టాభి, చింతా సత్యకృష్ణ, పసుపులేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న కాపు సంఘం నాయకులు

‘చలో కడప’ను విజయవంతం చేయాలి



చలో కడపను విజయవంతం చేయాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఎస్సీల ఏ,బీ, సీ,డీ వర్గీకరణ సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లాగు ప్రకాష్, ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గొల్లమందల శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కడిమి రాజేష్ కుమార్ కోరారు. బుధవారం వారు ఈమేరకు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 20వ తేదీన కడప పట్టణంలో నిర్వహించబోతున్న మాదిగల రాజకీయ సమన్వయ మహాసభకు రాష్ట్రంలోని మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఉద్యోగులు, మహిళలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా అణగారిన కులాలకు రాజ్యాధికారంలో అవకాశం కల్పించినప్పుడే ఆయా కులాల్లో కనీస అభివృద్ధికి నాంది పడుతుందని అన్నారు. జంగారెడ్డిగూడెం లయన్స్ క్లబ్ జిల్లా మెంబర్ ఉక్కుర్తి సీతారాం చేతుల మీదుగా కరపత్రాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో మద్దిపాటి ఇస్సాకు, మద్దిపాటి వెంకటేష్, లాగు ప్రకాష్, గొల్ల మందల శ్రీనివాసరావు, కడిమి రాజేష్ కుమార్, జొన్నకూటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



నారాయణపురం హైస్కూల్లో కలిసిన పూర్వ విద్యార్థులు

ఉంగుటూరు: నారాయణపురం వివేకానంద జిల్లా పరిషత్ హైస్కూలు పూర్వ విద్యార్థులు బుధవారం హైస్కూల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 2001-02లో పదవ తరగతి చదువుకున్న వీరంతా 22 ఏళ్ల తరువాత కలుసుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకించుకున్నారు. ఆనాటి హైస్కూలు జీవితంలో జరిగిన సంఘటనలు, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆనాటి తీపి గుర్తులను చర్చించుకున్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఆనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ కలయిక గుర్తుగా హైస్కూల్లో సైకిల్ షెడ్డు నిర్మాణానికి రూ.3 లక్షల సహాయం అందించారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాత లక్ష్మణరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు బుధవారం రూ.1,50,000 విరాళంగా అందజేశారు. తిరువూరుకు చెందిన పొట్లూరి లక్ష్మణరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.